క్లుప్తంగా

విద్యార్థులను ఆటల్లో ప్రోత్సహించాలి



ఆటల పోటీలు ప్రారంభిస్తున్న ఎయిర్‌ఫోర్స్ మాజీ కెప్టెన్ జేవీ సునీల్‌కుమార్

సీతంపేట : చదువుతోపాటు విద్యార్థులను ఆటపాటల్లోనూ ప్రోత్సహించాలని ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ మాజీ కెప్టెన్ జె.వి.సునీల్ కుమార్ సూచించారు. అక్కయ్యపాలెం పోర్టు స్టేడియంలో శుక్రవారం నిర్వహించిన పెన్ స్కూల్ ఒలింపిక్స్ వార్షిక క్రీడల పోటీలను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఏటా క్రీడా వార్షికోత్సవాలను నిర్వహిస్తూ ప్రోత్సహిస్తున్న పెన్ స్కూల్ యాజమాన్యాన్ని అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థుల మార్చ్‌ఫాస్ట్, డ్రిల్ అకట్టుకుంది. అనంతరం షాట్‌పుట్, ఖోఖో, కబడ్డీ, రోల్ బాల్, రింగ్ గేమ్ వంటి 25 రకాల ఆటల పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ అనితా పెరీరా, తదితరులు పాల్గొన్నారు.

28 కేజీల గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం : విశాఖపట్నం రైల్వేస్టేషన్ మీదుగా గంజాయి అక్రమంగా రవాణా చేస్తున్న నిందితులను శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు, రైల్వే భద్రతా దళం ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణ ఆధ్వర్యంలో జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో శుక్రవారం ముమ్మర తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో పశ్చిమ బెంగాల్ రాష్ట్రం, ముర్షిదాబాద్ జిల్లాకు చెందిన అనుర్బ సర్కార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రం, ఆజంగఢ్‌కు చెందిన జె.వర్మ విశాఖపట్నం స్టేషన్ మీదుగా అక్రమంగా గంజాయి తరలిస్తున్నట్లు గుర్తించారు. వారి నుంచి 28 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు.


కుటుంబ సభ్యులకు అప్పగింత



కోడలుతో సంజయ్

సీతమ్మధార: జార్ఖండ్ రాష్ట్రం, పలము జిల్లాలోని బందువ గ్రామానికి చెందిన సంజయ్ (55)ను కుటుంబ సభ్యులకు అప్పగించారు. కొన్నేళ్ల క్రితం భార్యతోపాటు సోదరుడు కాలం చేయడంతో సంజయ్ మానసికంగా కుంగిపోయాడు. అదే సమయంలో కుటుంబ పోషణ కోసం కొడుకుతో కలిసి పనికోసం బయలుదేరాడు. అప్పటికే మానసిక స్థితి సరిగ్గా లేకపోవడంతో వైజాగ్‌లో తప్పిపోవడంతో ఏయూటీడీ షెల్టర్‌లో ఆశ్రయం కల్పించారు. శ్రద్ధా ఫౌండేషన్ సహకారంతో వైద్యం అందించారు. ఇటీవల కోలుకోవడంతో వివరాలు సేకరించి స్వస్థలానికి తీసుకెళ్లి కోడలు సుఖ్నీదేవికి అప్పగించామని సంస్థ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు.

అలరించిన కర్ణాటక గాత్ర కచేరీ



త్యాగరాజ కీర్తనలు అలపిస్తున్న విద్యార్థులు

సీతంపేట : శ్రీలలితాపీఠంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన కర్ణాటక గాత్ర కచేరీ భక్తులను అలరించింది. విద్యార్థి మ్యూజిక్ స్కూల్ ప్రిన్సిపాల్ ఐ.జగదాంబ ఆధ్వర్యంలో ఆమె శిష్య బృందం సీహెచ్.పల్లవి, వందన, టి.ఉష, ఎస్.సౌగంధి, సహస్ర త్యాగరాజకీర్తనలు అలపించి ప్రేక్షకులను పరవశింపజేశారు. మహా గణపతింభజేతో ప్రారంభించి, శ్రీసరస్వతి, శ్రీరామ పాదమా, సుధా మాధుర్య, నను గన తల్లీ, బాల త్రిపుర కీర్తనలు ఆలపించారు. వీరికి ఐవటూరి కృష్ణవేణి వయోలిన్‌పై, తాలడ చైతన్య మృదంగంపై వాద్య సహకారం అందించారు.

20న వాహనాల వేలం

దాబాగార్డెన్స్ : వన్‌టౌన్ క్రైమ్ పోలీసు స్టేషన్ స్వాధీనంలో ఉన్న 3 అబాండెడ్ మోటార్ సైకిళ్ల(స్క్రాప్)ను ఈ నెల 20న బహిరంగ వేలం వేయనున్నట్టు వన్‌టౌన్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంతవరకు ఆ వాహనాల యజమానులు, సంబంధిత ఇన్సూరెన్స్ కంపెనీలు క్లెయిమ్ చేయని కారణంగా, మహారాణిపేట తహసీల్దార్ ఉత్తర్వుల మేరకు 20న ఉదయం 11 గంటలకు కొమ్మాది జంక్షన్ సమీపంలోని వెహికల్స్ డంపింగ్ యార్డ్ వద్ద వేలం వేయనున్నట్టు చెప్పారు. ఆసక్తి గల వారు వేలంలో పాల్గొనాలని కోరారు. మరిన్ని వివరాలకు 9440904310, 9491801354లో సంప్రదించాలని సూచించారు.

- ఎన్నికల వేళ మెగా డీఎస్సీ అంటూ హామీలిచ్చిన చంద్రబాబు
- అధికారం చేపట్టి 9 నెలలు గడిచినా వెలువడని నోటిఫికేషన్
- అదిగో ఇదిగో అంటూ కాలం వెళ్లదీస్తున్న కూటమి సర్కార్
- **చంద్రబాబు, పవన్, లోకేష్‌పై నిరుద్యోగుల ఆగ్రహం**

మెగా లేదు.. దగానే...!





పౌర గ్రంథాలయంలో డీఎస్సీ కోసం ప్రిపేర్ అవుతున్న విద్యార్థులు

సీతంపేట :

సమాజంలో ఉపాధ్యాయ వృత్తి అంటే గౌరవం, హోదా, ఎంతో మర్యాద, అంతకు మించిన ఆర్థిక భరోసా. ఒకప్పుడు టీచర్ ఉద్యోగం అంటే బతక లేక బడి పంతులు అనేవారు. ప్రస్తుత కాలంలో టీచర్ ఉద్యోగాన్ని మించిన ఉద్యోగం మరొకటి లేదని చెప్పొచ్చు. అందుకే ప్రభుత్వ ఉపాధ్యాయుడు కావాలని వేలాది మంది, కాదు కాదు... లక్షలాది మంది నిరుద్యోగుల కల. ఎప్పుడెప్పుడు డీఎస్సీ నియామక ప్రకటన వస్తుందా.., తమ కల నెరవేరుతుందా... అన్న ఆశతో వేయి కళ్లతో ఏళ్ల తరబడి ఎదురు చూస్తుంటారు. 2018లో డీఎస్సీ నియామకాలు జరిగిన తర్వాత మరలా ఇప్పటి వరకు డీఎస్సీ నోటిఫికేషన్ ప్రక్రియ పూర్తి కాలేదు. 2024లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 6,100 పోస్టులతో నోటిఫికేషన్ ఇచ్చింది. అభ్యర్థులు దరఖాస్తు చేసుకుని పరీక్ష కోసం సిద్ధం ఉన్న సమయంలో ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేసింది. అనంతరం అధికారం చేపట్టిన చంద్రబాబు ప్రభుత్వం ఆ నోటిఫికేషన్‌ను రద్దు చేసింది.

అదిగో ఇదిగో అంటూ దోబూచులాట

ఎన్నికల వేళ మెగా డీఎస్సీ అంటూ హామీలిచ్చిన చంద్రబాబు, అధికారంలోకి వచ్చాక అదిగో ఇదిగో అంటూ దోబూచులాడతున్నారని నిరుద్యోగులు మండిపడుతున్నారు. ఏడేళ్ల నుంచి డీఎస్సీ నోటిఫికేషన్ లేదు. ఈ ఏడేళ్లలో ఏడాదికి లక్ష మంది చొప్పున డైట్, బీఎడ్, డీఎడ్ పూర్తి చేసి నోటిఫికేషన్ కోసం ఎదురు చూస్తున్నారు. సుమారు 10 లక్షల మంది వరకు ఈసారి డీఎస్సీకి పోటీ పడనున్నట్టు తెలుస్తోంది. మెగా డీఎస్సీ అని హామీలిచ్చి ఇప్పుడు కేవలం 16 వేల పోస్టులకే నోటిఫికేషన్ ఇస్తున్నట్టు విద్యాశాఖ ప్రకటించడంపై ఆశావహులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ లెక్కన ఒక పోస్టుకు ఆరు వేల మంది పోటీ పడాల్సి వస్తుందని, డీఎస్సీలో పోస్టుల సంఖ్య పెంచాలని నిరుద్యోగ యువత డిమాండ్ చేస్తున్నారు. విద్యాశాఖ ప్రకటనతో ఉత్తర నియోజక వర్గంలోని యువత డీఎస్సీ కోసం రేయింబవళ్లు ప్రిపేర్ అవుతున్నారు. ముఖ్యంగా గ్రంథాలయాల్లో అకడమిక్ పుస్తకాలతో నిరుద్యోగులు కుస్తీ పడుతున్నారు.

మెగా డీఎస్సీ అని చెప్పి...



బీఏ బీఈడీ చదివాను. గత పదేళ్లుగా స్కూల్ అసిస్టెంట్ కోసం ప్రిపేర్ అవుతున్నాను. 2018లో ఎంపిక కాలేకపోయాను. చంద్రబాబు అధికారంలోకి వచ్చాక మెగా డీఎస్సీ అన్నారు. చూస్తే అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు గడిచిపోయింది. ఇప్పటికీ నోటిఫికేషన్ రాలేదు. ఇపుడేమో 16 వేల పోస్టులే తీస్తారని అంటున్నారు. గత ఏడేళ్ల నుంచి డీఎస్సీ లేక లక్షలాది మంది ఎదురు చూస్తున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల తర్వాత నోటిఫికేషన్ వస్తుందని తెలిసి రోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు పౌరగ్రంథాలయంలో ప్రిపేర్ అవుతున్నాను.

– బి.కృష్ణవేణి, ఎన్ఏడీ జంక్షన్.

ఏడేళ్లుగా ఎదురు చూస్తున్నా



2018లో డైట్ పూర్తి చేశాను. ఆ తర్వాత బీఎస్సీ డిగ్రీ పూర్తి చేశాను. 2018 నుంచి డీఎస్సీ నోటిఫికేషన్ కోసం ఎదురు చూస్తూ ప్రిపేర్ అవుతున్నాను. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఫిబ్రవరి 2024లో 6,100 పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చింది. దరఖాస్తు చేసి పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న సమయంలో ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైంది. దాంతో డీఎస్సీ నిలిచిపోయింది. **కూటమి** ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక **డీఎస్సీ ఫైల్‌**పై సంతకం చేశారు. కానీ నోటిఫికే**షన్ రాలేదు. మా**ర్చిలో నోటిఫికేషన్ వస్తుందంటు**న్నారు. ఎస్‌**జీటీ సాధించాలని గట్టిగా ప్రిపేర్ అవుతున్నా.

– బి.నాగేంద్రబాబు, కంచరపాలెం.

ఎన్నికల వేళ చంద్రబాబు హామీ



ఎన్నికల సమయంలో అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీ ప్రకటిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. దానిని నమ్మి నిరుద్యోగ యువత ఓట్లు వేసి గెలిపించారు. అధికారంలోకి వచ్చిన చంద్రబాబు గత ఏడాది జూన్ నెలలో మెగా డీఎస్సీ ప్రకటిస్తూ సంతకం చేశారు. దీంతో డీఎస్సీ కోసం ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్న యువతలో ఆనందం వెల్లివిరిసింది. కానీ ఆ ఆనందం ఎంతో సేపు నిలవలేదు. డీఎస్సీ విషయంలో చంద్రబాబు తనదైన రాజకీయం చూపించారు. డీఎస్సీ ఫైలుపై చేసిన సంతకం కాగితానికే పరిమితమయ్యింది. సంతకం చేసి 8 నెలలు కావస్తున్నా ఇప్పటికీ అధికారికంగా నోటిఫికేషన్ వెలువడ లేదు. ప్రకటన కోసం ఆశగా ఎదురుచూస్తూ నిరుద్యోగులు పరీక్ష కోసం ప్రిపేర్ అవుతున్నారు. టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల వేళ గ్రాడ్యుయేట్స్‌ను ఆకర్షించేలా మార్చి నెలలో 16,347 పోస్టులకు మెగా డీఎస్సీ నోటిఫికేషన్ వస్తుందని విద్యా శాఖ ప్రకటించింది. మే నెలలో ఎగ్జామ్, జూన్ నెలలో రిజల్ట్ ఇస్తామని చేసిన ప్రకటన నిరుద్యోగుల్లో ఆశలు రేకెత్తించింది. ఎమ్మెల్సీ ఎన్నికల కోసం హడావిడిగా ప్రకటన చేశారా..?, నిజంగా ఎన్నికలు ముగిశాక నోటిఫికేషన్ వెలువడుతుందా..? అన్న అనుమానాలు రేకెత్తుతున్నాయి.



మాట తప్పరని ఎదురుచూస్తున్నాం



పాడేరు నుంచి వచ్చి మద్దిలపాలెంలో రూమ్ అద్దెకు తీసుకుని డీఎస్సీ కోసం ప్రిపేర్ అవుతున్నాను. అధికారంలోకి వచ్చిన వెంటనే చంద్రబాబు మెగా డీఎస్సీ అన్నారు. అధికారంలోకి వచ్చాక ఫైల్‌పై చంద్రబాబు సంతకం చేసి తొమ్మిది నెలలు గడిచిపోయాయి. ఇప్పటికీ నోటిఫికేషన్ రాలేదు. నోటిఫికేషన్ వస్తుందన్న ఆశతో నేను మాత్రం ఏడాది కాలంగా ఎస్‌జీటీ కోసం ప్రిపేర్ అవుతున్నాను. మార్చిలో నోటిఫికేషన్, మేలో ఎగ్జామ్, జూన్‌లో రిజల్ట్ అంటున్నారు. మాట తప్పకుండా నోటిఫికేషన్ ఇస్తారని ఆశిస్తున్నాను.

– ఎస్.రాజుబాబు, మద్దిలపాలెం

తొమ్మిది నెలలు గడిచిపోయాయి



బీఎస్సీ మ్యాథ్స్ చదివాను. 2014లో అర మార్కు తేడాతో ఎస్‌జీటీకి ఎంపిక కాలేకపోయాను. 2024లో నోటిఫికేషన్ ఇచ్చారు. ఇంతలో ఎన్నికలు రావడంతో ఆగిపోయింది. చంద్రబాబు ప్రభుత్వం మెగా డీఎస్సీ అని హామీ ఇవ్వడంతో మరలా టీచర్ జాబ్ సాధించాలన్న ఆశ కలిగింది. ఏడాది కాలంగా లైబ్రరీలో ప్రిపేర్ అవుతున్నాను. అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు గడిచిపోయింది. ఇంకా నోటిఫికేషన్ మాత్రం రాలేదు. డీఎస్సీ అభ్యర్థుల సహనాన్ని పరీక్షిస్తున్నారు.

– ఎస్.ఇందిర, రామ్‌నగర్

కుల గణనతోనే బీసీలకు రాజ్యాధికారం



మాట్లాడుతున్న బీసీ సమన్వయ కమిటీ ఛైర్మన్ కట్టా మల్లేశ్వరరావు

సీతంపేట : రాష్ట్రంలో సమగ్ర కులగణన చేపట్టి బహిర్గతం చెయ్యాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సమన్వయ కమిటీ ఛైర్మన్ కట్టా మల్లేశ్వరరావు డిమాండ్ చేశారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శుక్రవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 76 సంవత్సరాల స్వాతంత్ర్య భారత చరిత్రలో బీసీలకు చట్టసభల్లో తగిన ప్రాతినిధ్యం కరువైందన్నారు. కులగణన కోసం రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని నిర్ణయించామన్నారు. కులగణన ద్వారా మనమెంత, మన వాటా ఎంత అనే నినాదంతో ప్రజల్లోకి వెళ్లి రాజ్యాధికారం సాధన దిశగా పయనిస్తామని తెలిపారు. బీసీ సంఘాలన్నీ ఒక తాటిపైకి వచ్చి ఒకే ఎజెండాతో బీసీల హక్కుల సాధన, ప్రాధాన్యత, రాజ్యాధికారం కోసం శ్రమిస్తామన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సమన్వయ కమిటీ కన్వీనర్ పెదపెంకి శివప్రసాద్‌కు మద్దతు తెలపాలని సమావేశంలో తీర్మానించారు. అధికార ప్రతినిధి పాలిశెట్టి మహాలక్ష్మినాయుడు, కో కన్వీనర్ పల్లా వెంకట అప్పారావు పాల్గొన్నారు.

విశాఖ జిల్లా కమిటీ ఏర్పాటు

బీసీ సమన్వయ కమిటీ విశాఖ జిల్లా కమిటీని సంఘం చైర్మన్ కట్టా మల్లేశ్వరరావు శుక్రవారం ప్రకటించారు. కన్వీనర్‌గా పెదపెంకి శివప్రసాద్, అధికార ప్రతినిధిగా పాలిశెట్టి మహాలక్ష్మినాయుడు, కో కన్వీనర్లుగా సీహెచ్.శ్రీనివాసరావు, కాండ్రేగుల వెంకట ఉమా మహేష్, కొత్తూరు భాస్కరరావు, నూలు అభిరామ్, తమ్మిరెడ్డి మంగతాయారు, భీమరశెట్టి విశ్వనాథం, పల్లా వెంకట అప్పారావు, కొమ్మోజు వెంకట సూర్యం, మహిళా కన్వీనర్‌గా జన్నెల అనుపమ, మహిళా కో కన్వీనర్‌గా పోతాబత్తుల ఆదిలక్ష్మి నియమితులయ్యారు. వీరంతా రాష్ట్ర కమిటీ ఆదేశాలను అనుసరిస్తూ బీసీ సమన్వయ కమిటీని విశాఖ జిల్లాలో బలోపేతం చేసేందుకు కృషి చేయాలని సూచించారు.

బర్మా కాందిశీకుల భూమిని కాపాడండి

మురళీనగర్ : బర్మా కాందిశీకుల నివాస గృహాలకు కేటాయించిన భూమిని కాపాడాలని బర్మా కాందిశీకుల పునరావాస సంక్షేమ సంఘం కోరింది. ఈ మేరకు కలెక్టర్‌కు వినతిపత్రం అందించామని ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.నారాయణరావు, ఎంకే కిషోర్ తెలిపారు. కప్పరాడ గ్రామం సర్వే నంబరు 13లో మొత్తం 13 ఎకరాల 26 సెంట్లు భూమి ఉండగా అందులో బర్మా కాందిశీకులకు కేటాయించిన 9 ఎకరాల 50 సెంట్ల భూమిని కాపాడి కాందిశీకులకు పూర్తి న్యాయం చేయాలని కోరారు. బర్మా నుంచి విశాఖపట్నం వచ్చిన కాందిశీకులకు 1985లో పునరావాసం కల్పించడం కోసం 788 మందికి గృహాలు నిర్మించాలని అప్పటి కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారని గుర్తు చేశారు. ఈ మేరకు 9 ఎకరాల 50 సెంట్ల స్థలాన్ని 13/ఎగా సబ్ డివిజన్ చేసి బర్మా కాందిశీకుల కుటుంబాలకు నివాస గృహాల నిర్మాణానికి ఎస్సీ కార్పొరేషన్ కో ఆపరేటివ్ సొసైటీకి అప్పగిస్తూ పరిపాలనా ఉత్తర్వులు జారీ చేశారన్నారు. అయితే మొదటి విడతగా 256, రెండో విడతగా 192, మూడో విడతగా 152 కలిపి మొత్తంగా 600 ఇళ్లు మాత్రమే నిర్మించారని చెప్పారు. కలెక్టరు ఉత్తర్వుల ప్రకారం ఇంకా 188 ఇళ్లు నిర్మించి ఇవ్వాల్సి ఉందని వినతిపత్రంలో పేర్కొన్నారు. వాటిని నిర్మించి బర్మా కాందిశీకుల కుటుంబాలకు అప్పగించాలని కోరుతూ జిల్లా ఉన్నతాధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా న్యాయం చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 2024 జనవరి 19న రెవెన్యూ, జీవీఎంసీ, యూఎల్‌సీ, దేవదాయ శాఖ ఉమ్మడిగా చేసిన సర్వే వివరాలను ఇంతవరకు బహిర్గతం చేయలేదని చెప్పారు. దీనిపై అధికారులను ఎన్నిసార్లు కలిసినా ఫలితం కనిపించలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. బర్మా కాందిశీకులకు కేటాయించిన భూమిని పూర్తి స్థాయిలో చూపించే వరకు ఎవరికీ హక్కులు మంజూరు చేయరాదని డిమాండ్ చేశారు.

జనన ధ్రువీకరణ పత్రాలు వెంటనే అందజేయండి



సమావేశంలో కమిషన్ సభ్యులు, వైద్యులు

మహారాణిపేట : బిడ్డ పుట్టిన వెంటనే సంబంధిత ధ్రువీకరణ పత్రాల్లో తప్పులు లేకుండా నేరుగా తల్లిదండ్రులకు అప్పగించేలా కేజీహెచ్ ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు బి.పద్మావతి, గొండు సీతారాం, ఆదిలక్ష్మి, త్రివర్ణ ఆదేశాలు జారీ చేశారు. విశాఖ జిల్లా పర్యటనలో ఉన్న కమిషన్ సభ్యులు శుక్రవారం కేజీహెచ్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డి.రాధాక్రిష్ణ అధ్యక్షతన సమావేశమయ్యారు. పిల్లల జనన ధ్రువీకరణ పత్రాల్లో తప్పొప్పులు, సవరణలపై చర్చించారు. సర్టిఫికెట్లు అందించేందుకు పిల్లల వార్డుకు అనుసంధానంగా ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశారా..? గత 2024లో జనవరి నుంచి డిసెంబర్ వరకు ఎంతమంది పిల్లలు జన్మించారని అడిగి తెలుసుకున్నారు. ఎన్ని దరఖాస్తుల్లో సవరణలు చేశారో ప్రశ్నించారు. పిల్లల వార్డు ప్రాంగణంలోనే డీఎస్‌వో, ఏఎస్‌వో ఆధ్వర్యంలో ధ్రువీకరణ పత్రాలు అందించాలని ఆదేశించారు. అనంతరం ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డి.రాధాకృష్ణ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుల ఆదేశాలు, సూచనలు పాటిస్తామన్నారు. సమావేశంలో కేజీహెచ్ సీఎస్ఆర్ఎంవో డాక్టర్ మెహర్, చిన్నపిల్లల వైద్య విభాగం అధిపతి డాక్టర్ బి.చక్రవర్తి, ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఉషా ప్రసాద్, ఆర్ఎంవో డాక్టర్ ధవళ భాస్కర రావు, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ జి.జయదేవి, అసిస్టెంట్ లేబర్ కమిషనర్ ఎస్.గోవింద రావు, చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ రమణ కుమారి, తదితరులు పాల్గొన్నారు.

వైభవుడికి సుప్రభాత సేవ నేడు

మురళీనగర్ : కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహిస్తామని ఆలయ కార్యనిర్వహణాధికారి బి.ప్రసాద్ తెలిపారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల నిర్వహించి సుప్రభాతం చదివి వినిపిస్తారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తారు. 7.30 గంటలకు బాలభోగం నివేదన, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థ ప్రసాద గోష్టి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన చేస్తారు. మధ్యాహ్నం నారాయణ సేవలో భాగంగా 300 మంది భక్తులకు అన్న సమారాధన చేస్తారు. సాయంత్రం 6.30 గంటలకు విశేష హారతి సమర్పణలో భాగంగా నక్షత్ర హారతి, కర్పూర హారతి, కూష్మాండ హారతి, కుంభ హారతి సమర్పిస్తారు.

నేడు కాలుష్యకారక వాహనాలు అనుమతించొద్దు

మురళీనగర్ : ప్రతీ మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర దినోత్సవం నిర్వహించాలని విశాఖ జిల్లా స్వచ్ఛ ఆంధ్ర నోడల్ అధికారి, కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా శనివారం ఒక్క రోజు జీరో ఒమిషన్‌డేగా పాటించాలని, కాలుష్యకారక వాహనాలను కాలేజీ ప్రాంగణంలోకి తీసుకురాకుండా సహకరించాలని విద్యార్థులు, ఉపాధ్యాయులను కోరారు. జిల్లాలోని 4 ప్రభుత్వ, 11 ప్రైవేటు పాలిటెక్నిక్ కాలేజీల్లో ఆయా ప్రిన్సిపాళ్లు ఇందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

రోడ్డు వెడల్పునకు చర్యలు

మద్దిపాలెం: జీవీఎంసీ 50వ వార్డులో ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు శుక్రవారం పర్యటించారు. ఈ మేరకు ఆయన వంశీనగర్‌నగర్ ప్రాంతంలో చేపట్టిన గెడ్డ పనులను పరిశీలించారు. అనంతరం స్థానికులతో మాట్లాడారు. వంశీనగర్ రోడ్డు ఇరుగ్గా ఉండడంతో దానిని వెడల్పు చేయమని స్థానికులు కోరారు. పెరుగుతున్న జీవన ప్రమాణాలు, జనాభా వల్ల ఇరుకు రోడ్డులో రాకపోకలు సాగించడం ఇబ్బందిగా ఉందని వాపోయారు. రోడ్డు వెడల్పునకు గల అవకాశాలను ఆయన వెంటనే పరిశీలించారు. సానుకూలంగా స్పందించిన ఆయన జీవీఎంసీ అధికారులతో మాట్లాడి రోడ్డు వెడల్పు కోసం చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

జోన్ - 5లో స్వచ్ఛతా డ్రైవ్



ర్యాలీలో విద్యార్థులు, జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ సోమన్నారాయణ

కంచరపాలెం : జీవీఎంసీ జోన్ - 5 జ్ఞానాపురం పరిధి సెబాస్టియన్‌కాలనీలో స్వచ్ఛభారత్ అభియాన్, వాతావరణ అనుకూలతలో భాగంగా శుక్రవారం జోనల్ కమిషనర్ బి.రాము అధ్వర్యంలో కమ్యూనిటీ ఎంగేజ్‌మెంజ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ సోమన్నారాయణ పాల్గొని మాట్లాడారు. కమ్యూనిటీ భాగస్వామ్యాన్ని పెంపొందించడానికి చేసే ప్రయత్నమే స్వచ్ఛతా డ్రైవ్ అని తెలిపారు. ఇన్ఫోగ్రాఫిక్ వాల్ ఆర్ట్, పీర్ లెర్నింగ్ సెషన్లు, డిజిటల్ కమ్యూనిటీ మొబిలైజేషన్ వంటి కార్యక్రమాలతో విద్యార్థులు, యువతకు అవగాహన కల్పించడం ఎంతో అభినందనీయమన్నారు. అనంతరం ప్లాస్టిక్ వద్దు... జూట్ బ్యాగులే ముద్దు అనే నినాదంతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ.సునీల్‌కుమార్, డీఈ రామసుబ్బారావు, ఏపీడీ పుణ్యవతి, జనార్దనరావు, శేఖర్, యోగా టీచర్ స్వాతి, తదితరులు పాల్గొన్నారు.

క్లస్టర్ కాంప్లెక్స్‌ల నిర్వహణకు ఏర్పాట్లు

నేడు పాఠశాల సముదాయాలు ప్రారంభం



ఏఎస్సార్‌నగర్‌లోని కప్పరాడ క్లస్టర్ కాంప్లెక్సు పాఠశాల

మురళీనగర్: ఉపాధ్యాయులు బోధనా నైపుణ్యాలు మెరుగుపరుచుకుని బోధనాభ్యసన పద్ధతుల్లో సృజనాత్మకత విధానాలపై చర్చించడానికి ఉద్దేశించిన పాఠశాల సముదాయాల (క్లస్టర్ కాంప్లెక్సులు) సమావేశాలు శనివారం ప్రారంభిస్తారు. ఈ మేరకు ఆయా పాఠశాల సముదాయాల్లో ఉపాధ్యాయుల సమావేశాలకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. మురళీనగర్ ప్రాంతంలోని మాధవధార ఉన్నత పాఠశాల, ఏఎస్ఆర్ నగర్‌లోని కె.కాలనీ పాఠశాలల్లో క్లస్టర్ కాంప్లెక్సులను ఏర్పాటు చేశారు. మాధవదార క్లస్టర్ పరిధిలో మాధవదార ప్రాథమిక, కప్పరాడ ప్రాథమిక, కె.మద్రిపాలెం ఉర్దూ ప్రాథమిక, ఇంగ్లిష్ మీడియం ప్రాథమిక, బుచ్చిరాజుపాలెం ప్రాథమికోన్నత, మాధవధార, కప్పరాడ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఈ క్లస్టర్ పరిధిలో ఏడు పాఠశాలు చేర్చగా, 82 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. వీరిలో 53 మంది స్కూల్ అసిస్టెంట్లు, 29 మంది ఎస్జీటీలు ఉన్నారు. మాధవధార క్లస్టర్‌కు మాధవధార ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బి.హేమలత కన్వీనరుగా వ్యవహరిస్తారు.

- కె..కాలనీ కాంప్లెక్సు పరిధిలో 7 పాఠశాలలు, 46 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. వీరిలో 19 మంది స్కూల్ అసిస్టెంట్లు, 27 మంది సెకండరీ గ్రేడ్ టీచర్లు ఉన్నారు. బర్మాకాలనీ, రాంజీ ఎస్టేట్, ఆశపువానిపాలెం, సుభాష్‌నగర్, దుర్గాపురం, సాకేతపురం ప్రాథమిక పాఠశాలలను కె.కాలనీ ఉన్నత పాఠశాల క్లస్టర్‌లో చేర్చారు. ఈ క్లస్టర్‌కు కె.కాలనీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎస్‌ఎస్‌ఎం సాయిలక్ష్మి కన్వీనరుగా వ్యవహరిస్తారు.

ఉపాధ్యాయుల హాజరు తప్పనిసరి

క్లస్టర్ కాంప్లెక్సులకు ఉపాధ్యాయులందరూ తప్పనిసరిగా హాజరు కావాల్సి ఉంటుంది. ఈ పాఠశాలల ఉపాధ్యాయులు మధ్యాహ్నం 12.45 గంటలకు క్లస్టర్ కాంప్లెక్సు పాఠశాలకు హాజరు కావాల్సి ఉంది. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం 12 గంటల లోపు పూర్తి చేసి ఉపాధ్యాయులందరూ క్లస్టర్ కాంప్లెక్సు సమావేశాలకు హాజరు కావాలి. ఎవరికీ సెలవులు అనుమతించేది లేదని అధికారులు చెప్పారు.

- మధ్యాహ్నం 1గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు క్లస్టర్ కాంప్లెక్సు సమావేశం నిర్వహిస్తారు. పాఠ్యాంశాల బోధనా విధానాలు, నూతన బోధనా పద్ధతులు, బోధనలో సాంకేతికత వినియోగం వంటి అంశాలపై విస్తృతంగా చర్చిస్తారు. కేవలం అకడమిక్స్‌కు సంబంధించిన అంశాలపైనే చర్చిస్తారు. సబ్జెక్టు వారీగా చర్చ జరుగుతుంది. ప్రతి సబ్జెక్టుకు ఒక గది, అందులో ఐఎఫ్‌సీ ప్యానల్‌ను నెట్ సౌకర్యంతో సిద్ధంగా ఉంచామని క్లస్టర్ హెచ్‌ఎంలు చెప్పారు. మధ్యాహ్నం స్నాక్స్ ఏర్పాటు చేశామని తెలిపారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- రోగులతో సెక్యూరిటీ సిబ్బంది మర్యాదగా ప్రవర్తించాలి

మహారాణిపేట : వైద్య సేవల నిమిత్తం ఆస్పత్రికి వచ్చే రోగులపట్ల సెక్యూరిటీ సిబ్బంది మర్యాదగా ప్రవర్తించాలని, అలాగే విధుల్లో నిర్లక్ష్యం లేకుండా పనిచేయాలని కేజీహెచ్ అడ్మినిస్ట్రేటర్ బి.వి.రమణ సూచించారు.

ఆస్పత్రిలోని వార్డులను తనిఖీ చేస్తున్న సమయంలో ఒక సెక్యూరిటీ గార్డు మద్యం సేవించి విధులకు హాజరైనట్లు గుర్తించి విచారణ చేపట్టి విధుల నుంచి తొలగించినట్లు పేర్కొన్నారు. అదే విధంగా ఇటీవల కాలంలో ఆపరేషన్ థియేటర్లో థియేటర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఒక కాంట్రాక్ట్ ఉద్యోగి కూడా అక్కడ పని చేస్తున్న ఉద్యోగుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడంతో విచారించి సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్ ఆదేశాల మేరకు విధుల నుంచి తొలగించినట్లు తెలిపారు. ప్రభుత్వ నిబంధనలను పాటిస్తూ ఆస్పత్రికి వచ్చే వారికి మెరుగైన వైద్య సేవలు, భద్రత కల్పించే విషయంలో అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. సిబ్బంది సమయపాలన పాటిస్తూ విధుల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అదేవిధంగా ఎఫ్.ఆర్.ఎస్ అమలు విషయంలో కూడా కఠినంగా వ్యవహరిస్తామని తెలిపారు.